# చావు నెపంతో జీవితాన్ని తడిమే "ఊ"

~ మెహెర్



**పుస్తక సమీక్ష:** చావు నెపంతో జీవితాన్ని తడిమే “అ”

**రచన:** మెహెర్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: డిసెంబరు 2013

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=553

©Author.

**What can you do with this document?**

Read it!

Store this PDF on your device.

Share the link with your friends

Share this PDF with your friends via personal communication (e.g. email)

Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.

Distributing to public (instead kindly share the link to Kinige given above)

## చావు నెపంతో జీవితాన్ని తడిమే 'అ'

పాలపర్తి ఇంద్రాణి నవలిక "అ" విడుదల ఈ ఏడాది తెలుగు రచనా ప్రపంచంలో ఒక సైలెంట్ ఈవెంటు. ఈ మధ్య కొన్ని పుస్తకాలు చేస్తున్న చప్పుణ్ణి బట్టి చూస్తే దీని సైలెన్సే దీని మొదటి ప్రత్యేకత అనుకోవాలి. ఇప్పటిదాకా కవిత్వమే వినిపించిన ఇంద్రాణి ఈ పుస్తకంతో మొదటిసారి వచనం రాయడం దీని మరో ప్రత్యేకత. ఫిక్షన్‌కీ, నాన్-ఫిక్షన్‌కీ మధ్య దూరాన్ని చెరిపేసే ఒక కొత్త రూపం కోసం ఆమె ప్రయత్నం దీనికున్న ఇంకో ప్రత్యేకత. అన్నింటికన్నా ముఖ్యంగా, "కల్పనాత్మక స్మృతి రచన" (fictionalised memoir) అనదగ్గ ఈ రచనలో, ఆమె మన అందరి ఫామిలీ ఫొటోల్లోనూ కొసన నిలబడ్డ ఎన్నో మసకబారిన సెపియా ముఖాల్ని సజీవంగా మన ముందుకు తెస్తారు; మన చేతన చేజార్చుకున్న ఎన్నో జ్ఞాపకాలకు మళ్లీ జీవం పోస్తారు.

పుస్తకం సైజుని బట్టి దీన్ని నవలిక అన్నట్టున్నారు. నిజానికి ఇది ఏ పద్ధతికీ విధేయంగా సాగదు. రచన మొదట్లో కథకురాలు (నేరేటర్) రోజూలాగే నగరంలో తన ఉద్యోగానికి బస్సులో వెళ్తుంది. చుట్టూ నగరవాతావరణం ఆమెను ఉక్కిరిబిక్కిరిగా చుట్టుముడుతుంది. ఇంతలో ట్రాఫిక్‌లో చిక్కుకుని నెమ్మదిగా వెళ్తున్న బస్సు రోడ్డు పక్కనున్న శ్మశానాన్ని సమీపిస్తుంది.

> "గోడ అవతల కాలగర్భంలో కలిసిపోయిన తండ్రులు, తల్లులు, అక్కలు, చెల్లెళ్ళు, అన్నలు, తమ్ముళ్ళు, పెద్దనాన్నలు, బాబాయిలు, తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు... వాళ్ళ బంధువులు వాళ్ళకై రకరకాల ఆకృతుల్లో కట్టించిన సమాధుల్లో అస్థిపంజరాలై, భూమాత నిశ్శబ్ద సంగీతాన్ని వింటూ వెల్లకిలా పడుకుని ఉన్నారు."

శ్మశానాన్ని చూడగానే నేరేటర్‌లో ఏదో ఆకస్మిక తిరుగుబాటు మొదలవుతుంది. ఆమె "ఇనపపెట్టె లోంచి కోడిపెట్టలా" బస్సులోంచి బయటికి దూకి రోడ్డు పక్కన ఉన్న శ్మశానంలోకి వెళుతుంది. దాని నిశ్శబ్దం ఆమెను సాదరంగా ఆహ్వానిస్తుంది. అక్కడి మర్రిచెట్టు కింద కూర్చుంటుంది. నాన్నని చిన్నప్పుడు తాతయ్య మర్రి ఊడలతో బాదటం ఆమెకు గుర్తుకు వస్తుంది. ఆమె గతంలో భాగస్థులైన చాలామంది ఇప్పుడు లేరు. ఆమె తండ్రి, తాతయ్య, కుతూహలం, మాధవ్ మామయ్య, మామ్మ, అమ్మమ్మ అందరూ ఇక్కడిలాగే ఎక్కడో మట్టి పొరల కింద బూడిదగా కలిసిపోయారు.

ఈ సన్నివేశం రచనలోని అన్ని భాగాలకూ సంధానకర్తగా పని చేస్తుంది. ఇక్కడితో మన ముందు జ్ఞాపకాల విన్యాసానికి తెర లేస్తుంది. ఆమె ఇలా శ్మశాన నిశ్శబ్దంలో కూర్చుని వర్తమానంలో తన చుట్టూ ఉన్న దృశ్యాలూ, ఘటనలూ కలిగించే ప్రేరేపణలతో గతంలోకి జారుకుంటుంది. తన కుటుంబాన్నీ, తన బాల్యాన్నీ, వాటి చుట్టూ ముసురుకునే స్మృతుల్నీ, అవి కేవలం స్మృతులు మాత్రమేనని నిక్కచ్చిగా తెలిపే కటువైన వర్తమానాన్నీ... అన్నింటినీ తలుచుకుంటుంది. ఈ నెమరువేత క్రమంలో మన జీవితంలోనో, జీవితపు పరిధుల్లోనో ఎప్పుడో తచ్చాడి ఇప్పుడు గతించిన వ్యక్తిత్వాలూ, సమసిపోయిన సన్నివేశాలూ తిరిగి రక్తప్రసారంతో, వర్తమాన సంచలనంతో వచ్చి మన ముందు నిలబడతాయి:

' "కందిపప్పు", "ఆవాలు", "ధనియాలు", "మెంతులు", "కారప్పొడి", "పంచదార", "ఎండుమిరపకాయలు".. అని వంటింట్లో డబ్బాల మీద ఒక్కో దినుసు పేరు, పిండి పేరు, పొడి పేరు, పచ్చడి పేరు వంకర టింకర అక్షరాలతో రాసిపెట్టేది [అమ్మమ్మ]. మధ్యాహ్నం ఎండవేళ అమ్మవి, తనవి పాత చీరలన్నీ కలిపి అమ్మ, అమ్మమ్మ బొంతలు కుట్టేవారు. "అ", "ఆ", "ఇ", "ఈ".. లను జంతికలుగా చేసి తినడానికి పెట్టేది. అవెంత రుచిగా ఉండేవంటే సునీలు నేను కలిసి తెలుగక్షరాలన్నీ ఎగబడి తినేసేవాళ్ళం. అమ్మమ్మ, నేనూ కలిసి మంచాలకున్న నవారు తీసి ఉతికి మళ్ళీ మంచాలకు అల్లేవాళ్ళం. అమ్మమ్మ పొట్ట వినాయకుడి పొట్టలాగా ఉండేది. నేను, అమ్మమ్మ చల్లని వేసవి కాలం రాత్రి ఆరుబయట మంచం వేసుకు పడుకుని నక్షత్రాలను చూస్తున్నప్పుడు బోర్లించిన కుండలా ఉండేది. అమ్మమ్మ పొట్టను ఊపుతుంటే నీళ్ళు నింపిన గాలి బుడగను ఊపుతున్నట్టుగా అనిపించేది. అమ్మమ్మ అరవై యేళ్ళ వయసున్నప్పుడు చనిపోయింది. కాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకున్న కళ్ళతో. ఆమె ఆపరేషను జరిగిన ఆసుపత్రి మా ఇంటికి దగ్గరలోనే ఉండేది. ఆ ఆసుపత్రి నిండా చెట్లే. అమ్మమ్మ ఒక్కతే రోగి. అది బ్రిటీషు వాళ్ళచే కట్టబడిన వంద ఏళ్ళ నాటి ఆసుపత్రి. ఒకప్పుడు అనేకమంది రోగులతోను, వైద్యులతోను కిటకిటలాడిన ఆసుపత్రి. ఇప్పుడు తేనె తీసేసిన తేనె తుట్టెలాగా ఉంటుంది. కానీ రికార్డుల్లో మాత్రం అనేకమంది రోగులకి వైద్య సేవలు అందిస్తున్నట్టు చూపి బ్రిటన్ నుండి బోలెడన్ని నిధులు సేకరిస్తున్న తేనెటీగలు ఆసుపత్రి చుట్టూ తిరుగుతుంటాయి. అప్పుడప్పుడు వాళ్ళు నేర్చుకుంది

మర్చిపోకుండా కంటి తుదుపుచర్యగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించేవారు. ఆసుపత్రి ఆవరణలో ఎర్రరాతితో కట్టబడ్డ ఓ అందమైన చర్చి ఉండేది. దాని మైకు సెట్టు, గోపురపు గంట ఎప్పుడూ బీద దొంగల చేతుల్లోకి వెళుతుండేవి. ఓ రోజు సాయంత్రం ఆ నిర్మానుష్యమైన ఆసుపత్రిలో, చర్చి తలుపులు మూసి ఉన్న వేళ అమ్మమ్మ కంటి ఆపరేషను జరిగింది. ఆపరేషను అయ్యి అమ్మమ్మ కన్ను బాగుపడ్డ కొన్ని రోజులకు తాతయ్య తద్దినం రోజున భోజనం చేస్తూ లడ్డూ నోట్లో ఉండగానే తెరిచిన నోరు తెరిచినట్టుగానే చనిపోయింది అమ్మమ్మ. శవాన్ని ఇంటి బయట చెట్టు కింద పెట్టారు. అమ్మమ్మ పొట్ట బండరాయిలా అనిపించింది. అది ఇంక ఊపినా ఊగదు. శవాన్ని తీసికెళ్ళిందాకా ఒక ఆకుపచ్చని పాము చెట్టు పైన్నే కూర్చుని ఉంది. అక్కడికి వచ్చిన వారంతా ఈ విషయాన్ని వింతగా చెప్పుకున్నారు.'

ఈ పుస్తకంలో ఇలా వివరంగా చిత్రించిన ప్రతీ పాత్రా చివరకు చనిపోయేదే. చనిపోవటమే వాళ్ళ ఎంపికకు అర్హత. ఈ పుస్తకం ముందు మాటలో రచయిత "ఇందులోని పాత్రలు వాటి స్వరూప స్వభావాలు అంతా కల్పితం. చావు ఒక్కటే నిజం" అంటారు. కానీ నాకు మాత్రం చావు ఒక నెపం మాత్రమే అనిపించింది. పుస్తకం చావు అనే నిప్పుల గుండం తొక్కుదామనే బయల్దేరినా మనకు సోకేవి మాత్రం కాష్టపు సెగలు కాదు, కాలపు కాళ్ళ కింద నలుగుతున్న స్మృతుల పూల పరిమళాలు. ఇందులో బాల్యం చూశాను, ఒక కుటుంబ చరిత్ర చూశాను, తెలుగువాడిగా నా ఐడెంటిటీని ఈ చాలా దగ్గరగా గుర్తుపట్టాను (తీర్థాలు, టైప్ ఇన్‌స్టిట్యూట్లూ, బడి పిల్లల కోసం వేసే సినిమాలు, ఆంటెన్నాలు, దూరదర్శన్‌లో ఇందిరాగాంధీ). తండ్రి మరణం తర్వాత ఈ పుస్తకం రాయాలన్న ఆలోచన కలిగిందని రచయిత ముందు మాటలో చెప్పుకున్నారు. కానీ ఇక్కడ మరణం ఇతివృత్తం కాదు, తనకు ఎడమైపోయిన గతాన్ని పునర్దర్శించుకోవటానికి మరణం ఒక సందర్భం మాత్రమే. నేరేటర్ వర్తమానంలోని తనకీ, బాల్యంలోని తనకీ మధ్య తండ్రి మరణం వల్ల ఏర్పడిన గోతిని దాటడానికి వేసుకున్న వంతెనే ఈ పుస్తకం. మరి పైన "పాత్రలు వాటి స్వరూప స్వభావాలు అంతా కల్పితం" అన్న మాట సంగతేమిటి? ఈ స్టేట్మెంటు ఒక పాఠకునిగా నా లోపలి తర్కంతో పొసగలేదు. అది రచయిత తన వ్యక్తిగత జీవితం చుట్టూ ఏర్పరుచుకోవాలనుకున్న కంచె మాత్రమే అనిపించింది.

ఈ నవలికలో కల్పితమని స్పష్టంగా తెలిసిపోయేది దీని నిర్మాణమే. అలాగే ఈ రచనకి ఎక్కడైనా దిష్టి చుక్క చూపించాల్సి వచ్చినా ఈ నిర్మాణం వైపే వేలెత్తి చూపించాలి. శ్మశానంలో కూర్చున్న నేరేటర్ అక్కడ ఏదో దృశ్యాన్ని పరికించడం, వాటి ఆధారంగా ఏదో గత జ్ఞాపకం రేగడం, మళ్ళీ వర్తమానంలోకి రావడం, మళ్ళీ అక్కడ ఏదో గమనించడం, మళ్ళీ గతం... ఇలా లంకెలు వేసుకుంటూ సాగుతుంది కథనం. కానీ ఈ లంకెలు అన్నిసార్లూ సహజంగా అమరలేదు. అంటే, శ్మశానంలో పెరిగిన పిచ్చి మొక్కల్ని చూస్తూ తన ఊళ్ళో బుద్ధిమాంద్యం గల కుర్రాణ్ణి గుర్తు తెచ్చుకోవడం, అక్కడ గాలికి ఎగురుతున్న తన నీలం రంగు చీరని చూసి తన పక్కింటి పాప శ్రావణి ఏడ్చినపుడు ఆమె ముఖం దాల్చే రంగుని గుర్తు తెచ్చుకోవడం, అక్కడ తలపోటు రాగానే బాల్యంలో తనకు మొదటిసారి తలపోటు వచ్చిన సందర్భాన్ని గుర్తు తెచ్చుకోవడం... మనిషి జ్ఞాపకం పని చేసే తీరు ఇలా ఉండదనిపించింది. మధ్యలో ఎంతో వాస్తవంగా కనిపించే నాన్–ఫిక్షన్‌కీ, దాన్ని మోయటానికి సృష్టింపబడిన ఈ ఫక్తు ఫిక్షనల్ నిర్మాణానికీ పొత్తు కుదరలేదు. ఫిక్షన్, నాన్–ఫిక్షన్లను గుర్తు దొరక్కుండా కలిపేయాలనే ప్రయత్నం బాగుంది, కానీ అది సమగ్రంగా ఇంకా పూర్తి కాలేదనిపించింది.

★

కథని నిలబెట్టిన నిర్మాణం అంతా కాల్పనికమే ఐనా, దాని ఆత్మ మాత్రం ఎంతో వాస్తవంగా తోస్తుంది. గతాన్ని అక్షరాల్లో పునర్నిర్మించే ప్రయత్నాలు చాలామంది చేస్తారు. కానీ జీవించే క్రమంలో వాళ్లతో వాళ్లకు ఎక్కడో పరిచయం తెగిపోవడం వల్లనో ఏమో, ఆ పునర్నిర్మాణాల్లో కల్తీ జొరబడిపోతుంది. సర్వజనామోదాన్ని దృష్టిలో ఉంచుకుని తమ అనుభవాల గాఢతను పలుచనో చిక్కనో చేస్తారు. సాహితీపరంపరలో బాల్యానుభవాలుగా ఏవైతే చెలామణీలో ఉన్నాయో వాటికి స్వల్పమైన వేరియేషన్లను మాత్రమే బయటపెట్టేందుకు సాహసిస్తారు.

చాలామంది రాసేవాళ్లకి తమది రచయిత హోదా అనీ, దానికి కొన్ని మర్యాదలున్నాయనీ; తమ వెనక ఒక సాహిత్య సంప్రదాయముందనీ, దానికి అంగీకారానంగీకారాలు కొన్ని ఉన్నాయనీ; తమ చుట్టూ సమకాలీన సాహిత్యం ఉందనీ, అక్కడ చెలామణీ అయ్యేవీ అవనివీ కొన్ని ధోరణులున్నాయనీ; తమ ముందు పాఠకులున్నారనీ, వారికి ఏవో ఇష్టాయిష్టాలుంటాయనీ... ఈ స్పృహ అతిగా ఉంటుంది. అనుభవాలనూ అనుభూతులనూ స్వచ్ఛంగా బయటకు రానివ్వకుండా,

ఇవి సాహిత్య సంప్రదాయానికి నప్పుతాయా అనీ, సమకాలీన సాహిత్యం మెచ్చుతుందా అనీ, "పాఠకులు" అనే అస్తవ్యస్త అమూర్త సమూహపు చైతన్యపుటద్దం మీద వాటి ప్రతిబింబాలు ఎబ్బెట్టుగా ఉండవు కదా అనీ... ఇలాంటి సంశయపు తెరల వెనక జంకుతుంటారు. ఈ ప్రభావాలన్నీ కాగితంపై వారి ప్రదర్శనను నిర్దేశిస్తాయి.

కానీ ఈ రచనలో నాకు అది కనిపించలేదు. రచయిత తన అనుభవాలను ఎక్కడా regularize చేయాలని గానీ, వాటిలోంచి పనిగట్టుకు profundity పిండాలని గానీ ఆశించలేదు. చావు అనే బరువైన విషయం గురించి మాట్లాడుతూనే, ఒక చోట చీమలు మనుషులలోకాన్ని ఎలా చూస్తాయనే – చూట్టానికి అల్పంగా తోచే – ఊహ గురించీ రాస్తారు. తన కవితలతో పాటూ, "వానా వానా వెల్లువాయే – పక్కింటోడి పెళ్లాంపోయే"లాంటి చిన్నప్పటి కట్టుడు పాటల్నీ ఉటంకిస్తారు:

> 'కిరీటాలు పెట్టుకుని, పట్టుపంచెలు కట్టుకుని ఆకాశంలో జంటలు జంటలుగా ఎగిరివెళుతుండే దేవతా పురుషులు, "ఈ ప్రశ్నకు సమాధానం తెలిసి కూడా చెప్పకపోయావో నీ తల వెయ్యి వక్కలౌతుంది" (వక్కలంటే తాంబూలంలో వేసుకునే వక్కలనుకున్నా అప్పట్లో చాలా ఏళ్ళు) అంటూ ఎప్పుడూ బెదిరించే భేతాళుడు, కత్తి పట్టుకుని రహస్య సొరంగ మార్గాలలో దారిలో కనిపించిన ప్రతి రాక్షసుడిని ముక్కలు చేస్తూ ముందుకు సాగే రాజకుమారుడు ఇలా ఎంతోమందిని కలుస్తూ, వాళ్ళతో పాటు ఎగురుతూ, నడుస్తూ, మాట్లాడుతూ, నవ్వుతూ, ఒక్కోసారి అరుస్తూ ఉండేదాన్ని. కొన్నాళ్ళు బ్రహ్మ గురించి, కొన్నాళ్ళు శివుడి గురించి, దోమలు కుడుతున్నా లెక్క చెయ్యకుండా, వీలైనంత సేపు ముక్కు మూసుకుని, నిలబడగలిగినంత సేపు ఒంటి కాలి మీద నిలబడి కఠినమైన తపస్సు (తపస్సంటే కళ్ళు మూసుకుని ఏకాగ్రతతో "ఓం" అని ధ్యానించడం) కూడా చేసాను చాలా రోజులు, ఎండాకాలం సెలవల్లో. చందమామ కథల్లో ఊరూరికే ప్రత్యక్షమైపోయే దేవుళ్ళు నాకు మాత్రం ఒక్కసారి కూడా కనిపించలేదు, తపస్సు సమయాన్ని పట్టుదలతో పెంచుతూ పోయినా. మరుగుజ్జుగా మారిపోయి టమోటో చెట్టు కొమ్మకి వుయ్యాల వేసుకుని ఊగాలని అనిపించేది. మళ్ళీ అప్పుడు టమోటో ఒకటి నెత్తి మీద పడితే దాని కింద నజ్జు నజ్జు అయిపోతాను కదా అని భయం వేసేది.'

పై పేరాలో లింగపరమైన అభేదం కూడా కనిపిస్తుంది. అంటే వాక్యాల్లో సర్వనామాల దగ్గర తప్ప అది రాస్తున్నది ఒక స్త్రీ అని పట్టించే గుర్తులు ఎక్కడా లేవు. బాల్యానికి స్త్రీలింగం పుల్లింగాలని భేదాలుండవు, నిజమే. కానీ ఈ రచయిత విషయంలో ఇది బాల్యానికే పరిమితం కాదనిపిస్తుంది. చాలామంది స్త్రీ రచయితలు తమ ఫిమేల్ ఐడెంటిటీని రచనల్లో వదులుకోలేరు. ఇలాంటి స్మృతి రచనల్లో అదింకా కష్టం. ఇక్కడ నేను చెప్పల్చుకున్న భావం అమూర్త వ్యక్తీకరణల ఎరలో చిక్కుకుపోకుండా, కొన్ని స్పష్టమైన ప్రాతినిధ్య పదాలు వరుసగా విసురుతాను... "భావుకత్వం", "బాపూ బొమ్మ", "ముంగిట ముగ్గులు", "రాధా కృష్ణులు", "నేత చీరలు", "శ్రీవారికి ప్రేమలేఖ – మనసా తుళ్లిపడకే", "వానజల్లు – మట్టి వాసన", "ధనుర్మాసం"... ఇలా స్త్రీ రచయితలు ప్రపంచాన్ని అందమైన ఆడతనపు కోణంలోంచే చూడటానికి ఇష్టపడతారు. (శిలాలోలిత రేవతీ దేవి, ఆర్. వసుంధరాదేవి లాంటి కొంతమంది మినహాయింపులూ ఉన్నారు.) కానీ ఈ నవలికలో అలా స్త్రీత్వపు గుర్తింపుకు అప్లయి చేస్తున్నతనం ఎక్కడా లేదు. ఉదాహరణకు నవలిక మొదట్లో బస్సులోంచి నగరపు రద్దీ వర్ణిస్తున్నపుడు నేరేటర్ తనకు తెరలుగా వస్తున్న దగ్గునీ, గొంతులోకి ఉబికిన ఖళ్ళిని, దాన్ని ఎక్కడ ఉమ్మెయ్యాలన్న మీమాంసనీ దేన్నీ – వికృతత్వాలకు దూరంగా ఉండే స్త్రీ సహజమైన సౌకుమార్యంతో – దాటుకుపోదు. అంటే అలాంటి వికృత వివరాల జోలికి నిస్సంకోచంగా వెళ్ళటం మాత్రమే నేను చెప్తున్న లైంగిక అభేదానికి ఋజువా? అది మాత్రమే కాదు, ప్రపంచం ముందు ఒక్క మనిషి అన్న గుర్తింపుతో మాత్రమే నిలబడటం గురించి మాట్లాడుతున్నాను. ఇదే నవలికలో ఉటంకించిన ఒక కవిత దీనికి ఉదాహరణ:

బొరుగు మిఠాయి నములుతూ
అరిగిపోయిన జోళ్ళు ఈడ్చుకుంటూ
మేకలు తోలుకుపోతోంది ఓ పిల్ల

గుడ్డమూ తలకింద పెట్టుకుని
పాడుబడ్డ మండపంలోంచి బవిరి గడ్డం సన్యాసి
తత్వమొకటి ఎత్తుకుంటున్నాడు

చింతచెట్టు పరిచిన నీడ కింద
తేగల బుట్ట పక్కన పెట్టుకొని

నోరు తెరిచి నిద్రపోతోంది ఓ అవ్వ

సాలీడు లేసులల్లిన సమాధి మీద

నిలబడిన దిసమొల వాడొకడు

హ్హాహ్హాహ్హా అని కేకలు వేస్తున్నాడు

ఊళ్ళోకి దారెటంటూ వీళ్ళల్లో

ఎవరిని అడగాలా అని

తికమక పడిపోతూ

నిలబడిపోయాను.

ఈ నవలికలో మరో విశేషమేమిటంటే ఇందులో ప్రతి అధ్యాయానికి ముందు (వాటిని అధ్యాయాల కన్నా mnemonic vignettes అంటే సరిపోతుందేమో) ఒక్కో కవితను epigraph లాగా ఇచ్చారు. ఇవి పుస్తకానికి కేక్ మీద క్రీంలా పనికొస్తున్నాయి.

★

కవిత్వంతో పోల్చినపుడు, వచనంలో ఇక అక్షరం కూడా మార్చనవసరం లేదూ అనగలిగేంత కట్టుదిట్టమైన పరిపూర్ణతను సాధించడం కష్టం. వచనం పరిపూర్ణత లేని కళ. దాని జోలికి రావాలంటే అపరిపూర్ణతల్ని ధైర్యంగా ఔదలదాల్చే చేవ ఉండాలి. అది లేని వాళ్ళకు అందులో సౌకర్యం ఉండదు. ఇంద్రాణి తెర వెనుక ఏం పాట్లు పడ్డారో తెలియదు గానీ, తెర ముందైతే ఏ అసౌకర్యమూ కనపడనీయలేదు. ఆమె వచనం అహమూ అట్టహాసమూ లేకుండా, మెరుగులూ మర్యాదలూ పట్టించుకోకుండా సాగుతుంది. ఈ నవలిక పేరు "అ"ని ఈ ఊనెస్‌కి కూడా వర్తింపజేయొచ్చు. ఇది వచనం అనే పనిముట్టుకు మాత్రమే సంబంధించిన లక్షణం మాత్రమే కాదేమో, ఈ ఎచ్చులకుపోనితనం ఆ పనిముట్టు వాడేవాళ్ళ లోనూ స్వభావసిద్ధంగా ఉండాలేమో.

~ మెహెర్

ప్రాప్తి: ఈ–బుక్: కినిగెలో వెల: 90/-

For Latest Telugu Books - Visit now:

Kinige.com